పారిశుద్ధ్యం పాతర

• గ్రామాల్లో చెత్త, చెదారంతో దర్శనమిస్తున్న వీధులు • విజృంభిస్తున్న దోమలు

గుడివాడరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. డ్రెయినేజీల్లో పూడిక తీత సక్రమంగా తీయకపోవడంతో మురుగు నీరు రోజుల తరబడి నిల్వ ఉండి దోమలకు ఆవాసంగా మారింది. మండలంలోని లింగవరం, వలివర్తిపాడు, మల్లాయపాలెం, బొమ్ములూరు, రామనపూడి, బిళ్లపాడు, చౌటపల్లి, మోటూరు,పర్నాస, కల్వపూడి అగ్రహారం, తటివర్రు తదితర గ్రామాల్లో రోడ్ల వెంబడి చెత్త వేయడంతో దోమలు విజృంభిస్తున్నాయి. ఈ విషయాన్ని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఇప్పటి వరకు గ్రామాల్లో దోమల నివారణకు మందు పిచికారీ చేయకపోవడంతో దోమల బెడద ఎక్కువగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



లింగవరం-పోలుకొండ ప్రధాన రహదారి వెంబడి పేరుకుపోయిన చెత్త



రామాలయం వద్ద డ్రెయినేజీ పూడి పోయి పొర్లుతున్న మురుగు నీరు

రోడ్లపైనే చెత్త

గ్రామాల్లో అంతర్గత రోడ్లు, వీధులు చెత్తతో నిండిపోతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో ఇంటింటి చెత్త సేకరణకు ప్రత్యేకంగా వాహనాలను ఏర్పాటు చేశారు. పట్టణాల మాదిరిగానే గ్రామాల్లోనూ చెత్తను సేకరించేందుకు వాహనాలు, ప్రత్యేక సిబ్బందిని పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ సిబ్బంది గ్రామాల్లో ఉన్న ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించడంతో గ్రామాల్లో వీధులు పరిశుభ్రంగా ఉండేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక నెల రోజుల నుంచి చెత్త సేకరణను పంచాయతీలు పక్కనబెట్టడంతో వీధులు మురికి కూపాలుగా దర్శనమిస్తున్నాయి.

బెంబేలెత్తిస్తున్న వ్యాధులు

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు అటకెక్కడంతో అంటు వ్యాధులు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. దోమలు స్వైర విహారం చేయడంతో ప్రజలు వ్యాధులబారిన పడుతున్నారు. జ్వరాలు, దగ్గు, జలుబు తదితర వ్యాధులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరచి పారిశుద్ధ్య నిర్వహణ పట్ల శ్రద్ధ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోరు



గ్రామంలో సమస్యలు తాండవం చేస్తున్నాయి. ఏ వీధి చూసినా చెత్తతో కన్పిస్తూ దుర్గంధం వెదజల్లుతోంది. చెత్తను తొలగించాలని పలు మార్లు సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదు. పాలకులు స్పందించాలి.

– ఎ.రవికిరణ్, సామాజికవేత్త, లింగవరం

ప్రబలుతున్న వ్యాధులు

గ్రామంలో చెత్త పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు పారుదల లేక దోమలు, కీటకాలు ఎక్కువ కావడంతో అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి. పంచాయతీ అధికారులకు పట్టడం లేదు. ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించాలి.

– అశోక్, తటివర్రు గ్రామం

సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు

మండలంలోని గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం. ఇప్పటికే ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని పంచాయతీ అధికారులు, సిబ్బందికి సూచనలు జారీ చేశాం. విధుల నిర్వహణ నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటాం.

–టీవై విష్ణుప్రసాద్, ఎంపీడీఓ

నేటి నుంచి ప్రీఫైనల్ పరీక్షలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని జెడ్పీ హైస్కూళ్లలో పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు ఈ నెల 20 వరకు రోజూ ఉదయం 9.30 నుంచి 12.45 వరకు జరుగుతాయి. ఇందులో భాగంగా 10న తెలుగు, 11న హిందీ, 12న ఇంగ్లిష్, 15న గణితం, 17న ఫిజికల్ సైన్స్, 18న బయోలజికల్ సైన్స్, 20న సోషల్ పరీక్షలు నిర్వహించనున్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు ఉద్యమించాలి

మొవ్వ(పామర్రు): షెడ్యూల్ కులాలన్నీ ఒకే తాటిపై ఉండాలన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ఉద్యమించాల్సిన సమయం వచ్చిందని అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవీప్రసాద్ అన్నారు. మొవ్వ మండలం కూచిపూడిలోని వర్తక సంఘం కల్యాణ మండపంలో ఆదివారం మాల సంఘాల మండల జేఏసీ ఆధ్వర్యంలో 'రాజ్యాంగ పరిరక్షణ సభ' జరిగింది. ముఖ్య అతిథులుగా అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవీప్రసాద్, సమతా సైనిక్ దళ్ సౌత్ ఇండియా ప్రెసిడెంట్ రెంజర్ల రాజేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవీప్రసాద్ మాట్లాడుతూ మాలలంతా ఏకమై ఎస్సీ వర్గీకరణపై వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. దేశంలో షెడ్యూల్ క్యాస్ట్‌లో 1,200 కులాలు ఉన్నాయన్నారు. రాజ్యాంగంలో మాల, మాదిగ అని ఎక్కడా విడివిడిగా లేదన్నారు. అన్నీ కలిసే ఉన్నాయని, వాటిని ఎలా విడదీస్తారని ప్రశ్నించారు. వర్గీకరణను సమర్థించడానికి రాష్ట్రాలకు అధికారం లేదన్నారు. దుర్మార్గపు ఆలోచనలతో సీఎం చంద్రబాబు మాలలకు అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కృష్ణా జిల్లాలో ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా మాలలకు ఇవ్వని వ్యక్తి చంద్రబాబు అని పేర్కొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పమిడిముక్కల: మండలంలోని గొడపాలెం, ఐనపూరు, కూడేరు, శ్రీరంగపురం, లంకపల్లి, నమ్మితాలగుంట, వెట్టివానిగూడెం గ్రామాలకు సోమవారం ఉదయం ఏడు నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

పేదలకు అన్నదానం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవా భవన్‌లో ఆదివారం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ, లయన్స్ జిల్లా మాజీ చైర్మన్ వై.పి.సి.ప్రసాద్, లయన్స్ ప్రతినిధులు పెరుమాళ్లు, రామకృష్ణ, పరంధామయ్య పాల్గొన్నారు.

మద్యం షాపుల డ్రా వాయిదా

గుడివాడరూరల్/గుడ్లవల్లేరు: గీత కార్మికుల మద్యం షాపుల డ్రా మచిలీపట్నంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరగాల్సి ఉంది. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆ డ్రా కార్యక్రమం వాయిదా పడినట్లు గుడివాడ ఎక్సైజ్ సీఐ పి.వెంకటరమణ ఆదివారం తెలిపారు. మళ్లీ ఉన్నతాధికారులు డ్రా తేదీ ప్రకటించే వరకు గీత కార్మికులకు సహకరించాలని కోరారు.

కైకలూరులో..

కైకలూరు: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ నెల 10న ఏలూరు చలసాని గార్డెన్‌లో జరగాల్సిన కల్లుగీత మద్యం దుకాణాల లాటరీ డ్రా వాయిదా పడినట్లు కైకలూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ ఎస్‌కే.రమేష్ ఆదివారం తెలిపారు. ఎలక్షన్ కమిషన్ అనుమతి లభించిన తరువాత డ్రా తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు.

కొండలమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



గుడ్లవల్లేరు: కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తుల సందడి అధికమైంది. ఆదివారం అధికసంఖ్యలో భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా పరమేశ్వరుడికి అన్నాభిషేకం



పామర్రు: అంకమ్మతల్లి ఆలయంలోని రేణుకా పరమేశ్వరునికి ఘనంగా అన్నాభిషేక కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మాఘ మాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో స్వామికి విశేష కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత స్వామికి పంచామృతాలతో అభిషేకాలను చేశారు. అనంతరం స్వామికి భక్తులు కె.శ్రీనివాస్, శ్రీదేవి దంపతులు అన్నాభిషేకం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ వరదా అప్పారావు, సభ్యులు ఉమా మహేశ్వరరావు, కె దుర్గాప్రసాద్, మేకా పేరయ్య, చెన్నారాయుడు పాల్గొన్నారు.

పొంగ మంచుతో ఇక్కట్లు



గుడ్లవల్లేరు: ఎముకలు కొరికే చలితో పొగమంచు దుప్పటి గుడ్లవల్లేరును ఆదివారం కమ్మేసింది. జోరుగా కురిసే పొగమంచులో ఉదయం వాహన చోదకులకు ఇక్కట్లు తప్పటం లేదు. ఉదయం ఎనిమిది గంటలైనా సూర్యుడు కనిపించకుండా తెల్లగా మసక బారినట్లుగా అలుముకుంది. లైట్లు ఉంటే గాని ఎదుట వస్తున్న వాహనాలు కనబడలేదు. ఈ పొగమంచు దెబ్బకి జనం చలి కోట్లు, మంకీ క్యాప్‌లు లేకుండా బయటకు అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది.

సమాజ సేవపై శ్రద్ధ చూపాలి



గుడివాడ టౌన్: విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాలపై శ్రద్ధ చూపాలని ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ జీవాస్ అన్నారు. ఆదివారం స్వచ్ఛభారత్, హరితా భారత్‌ను పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు తొలగించడం, వ్యర్థాలను తొలగించి శుభ్రపర్చడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ అలియాబేగం పాల్గొన్నారు.

వైభవంగా సరస్వతీ యాగం



సరస్వతీ యాగంలో పాల్గొన్న విద్యార్థులు



భక్తులకు అన్నసమారాధన

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో సరస్వతీ యాగాన్ని ఆదివారం వేద పండితులు నిర్వహించారు. ఈ యాగాన్ని మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు, విద్యార్థులు ఈ యాగంలో పాల్గొని తీర్థ ప్రసాద వినియోగం చెల్లించారు. దేవస్థాన ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న భక్తులు

డోకిపర్రు భూ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు.

పుట్టగొడుగుల్లా అక్రమ లేఅవుట్లు

అనుమతులు లేకుండా వెంచర్ల ఏర్పాటు

పామర్రు: నియోజకవర్గంలో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. పంట పొలాలను తక్కువ రేటుకు కొనుగోలు చేసి వాటిని వెంచర్లగా మార్చి ప్రజలకు మాయ మాటలు చెప్పి విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొనుగోలు చేసిన పొలాలకు నాలా చెలిచకుండా, సీఆర్‌డీఏ అనుమతులు లేకుండా విచ్చలవిడిగా లే అవుట్లు వేసి, ప్రజల జేబులను ఖాళీ చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సుమారు 100కు పైగా అక్రమ లేఅవుట్లు ఉన్నాయి. పామర్రు మండలంలోని విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి నుంచి ఉరుటూరు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే కురుమద్దాలి పంచాయతీ పరిధిలో ఓ వ్యాపారి సుమారు 50 ఎకరాల్లో వెంచర్ వేసి అమ్మకాలు చేపడుతున్నారు. దీనికి ఏవిధమైనా అనుమతులు లేకుండానే వారానికి ఒక రోజు అదే స్థలంలో కొనుగోలుదారులను తీసుకొచ్చి వారికి మాయ మాటలు చెప్పి విక్రయాలు కూడా జరుపుతున్నట్లు సమాచారం.

పట్టించుకోని అధికారులు

పామర్రు మండలంలో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో అమాయకపు ప్రజలు ప్లాట్లను కొనుగోలు చేసి ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులకు సంబంధిత వెంచర్ల వారి మధ్యన లావాదేవీలు ఉన్నందునే అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.



పామర్రు మండలం కురుమద్దాలి గ్రామ పరిధిలో వేసిన వెంచర్

అనుమతులు లేవు

కురుమద్దాలి గ్రామ పరిధిలో వేసిన వెంచర్‌కు ఏవిధమైన అనుమతులు లేవు. పంచాయతీకి ఏవిధమైన పన్నుల చెల్లించలేదు. అనమతులు లేకుండా వెంచర్ ఏర్పాటుపై తగు చర్యలు తీసుకుంటాం.

– అంజనాదేవి, కురుమద్దాలి గ్రామ కార్యదర్శి

పీడీ మురళి ప్రతిభ



పతకం అందుకున్న పీడీ మురళి



పతకాలు సాధించిన మొవ్వ మండల మాస్టార్లు

పామర్రు: జాతీయ మాస్టర్స్ 44వ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక కంచర్ల రామారావు జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ గుమ్మడి మురళి నాలుగు మెడల్స్‌ను సాధించారు. ఈ నెల 6,7.8 తేదీల్లో రాజస్థాన్‌లోని ఆల్వార్ జిల్లాలోని రాజ్ రిషి కాలేజ్‌లో జరిగిన పోటీల్లో నాలుగు పతకాలను సాధించి విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా పోటీల నిర్వాహకులు ఈ మెడల్స్‌ను మురళికి అందజేశారు. రెండు గోల్డు మెడల్స్, ఒక సిల్వర్ మెడల్, ఒక బ్రాంజ్ మెడల్ సాధించిన పాఠశాల పీడీ మురళీని హైస్కూల్ హెచ్ఎం ఏ ఇందిరారాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

మొవ్వలో..

మొవ్వ: రాజస్థాన్ రాష్ట్రం అల్వార్‌లో ఈ నెల 6,7, 8 తేదిల్లో జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో మొవ్వ మండలానికి చెందిన ఇద్దరు మాస్టార్లు ప్రతిభ కనపరిచినట్లు వారు స్వయంగా ఆదివారం విలేకరులకు తెలిపారు. మొవ్వ మండలం పెదపూడి ఎంపీయూపీ పాఠశాల హిందీ ఉపాధ్యాయులు ఎస్ఎస్ నాగమల్లేశ్వరరావు మూడు గోల్డ్ మెడల్స్ సాధించారు. మొవ్వలోని శ్రీ మండవ కనకయ్య జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ అప్పికట్ల రామారావు 40 ప్లస్ మెన్ విభాగంలో ఐదు కిలోమీటర్ల నడక పోటీలు, ట్రిపుల్ జంప్, 400 మీటర్ల హార్డిల్స్ విభాగంలో తృతీయ స్థానం సాధించి బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు.

గుండెపోటుతోనే డ్రైవర్ సుబ్బారావు మృతి

కైకలూరు: టిప్పర్ డ్రైవర్ బాలిగిన సుబ్బారావు(60) గుండెపోటుతోనే మృతి చెందాడని కైకలూరు రూరల్ పోలీసులు ఆదివారం ప్రాథమికంగా నిర్ధారించారు. శనివారం రాత్రి శీతనపల్లిలో మట్టి టిప్పర్‌తో వస్తున్న పామర్రుకు చెందిన డ్రైవర్ సుబ్బారావు వాహనాన్ని రోడ్డు సమీపంలో నిలిపివేశాడు. వెనక వస్తున్న మరో టిప్పర్ డ్రైవర్ గమనించి లారీ ఓనర్ పీవీకే.ప్రసాద్‌కు సమాచారం అందించాడు. దీంతో ప్రసాద్ పామర్రులో సుబ్బారావు కుమారుడు రాజుకు తెలియచేయగా 108 వాహనంతో అతను వచ్చాడు. అప్పటికే సుబ్బారావు మరణించాడు. సహజమరణం కావడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని రాజు చెప్పాడు. సోషల్ మీడియాలో చెట్టును ఢీకొని సుబ్బారావు మరణించాడని వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఈ సందర్భంగా పోలీసులు కోరారు.

రహదారికి మరమ్మతులు చేపట్టాలి

ముదినేపల్లి రూరల్: మండలంలో ప్రధానమైన చినకామనపూడి-లింగాల పంచాయతీరాజ్ రోడ్డు మరమ్మతులకు చర్యలకు తీసుకోవాలని చినకామనపూడి సర్పంచ్ చిట్టూరి నాంచారయ్య కోరారు. చినకామనపూడి నుంచి మండవల్లి మండలం లింగాల హైవే వద్ద కలిసే ఈ రోడ్డు మూడు కిలోమీటర్ల పొడవునా గోతులమయంగా మారి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. పదేళ్లుగా రహదారి అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోనందున గోతులమయంగా మారి వాహనాల రాకపోకలకు అనువుగా లేకుండా పోయింది.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్ : ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

12న మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం

మండవల్లి: మండవల్లి నాగసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి నవమ వార్షిక మహోత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 12న సాయంత్రం 6 గంటలకు శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు చాగంటి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం



బహుమతులు పొందిన క్రీడాకారులతో పాఠశాల యాజమాన్యం

గుడివాడ టౌన్: విశ్వభారతి వైజ్ ఉడ్ స్కూల్లో ఆదివారం ఘనంగా క్రీడాదినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆదాయ పన్నుల శాఖ విశ్రాంత చీఫ్ ప్రిన్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్ విచ్చేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు వ్యక్తిత్వాన్ని, క్రమశిక్షణను పెంపొందిస్తాయన్నారు. పలు క్రీడల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్వభారతి విద్యా సంస్థల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, డైరెక్టర్ ఆర్.మంజుల, ఆర్.ప్రణీత్ పాల్గొన్నారు.

మొక్కజొన్న కళకళ



తోట్లవల్లూరులో సాగవుతున్న మొక్కజొన్న పైరు

తోట్లవల్లూరు: మొక్కజొన్న పైరు కళకళలాడుతోంది. మండలంలోని రొయ్యూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, భద్రిరాజుపాలెం, పాములలంక, చాగంటిపాడు, దేవరపల్లి, గురివిందపల్లి, ఐలూరు గ్రామాల్లో మొక్కజొన్నను రైతులు సాగు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం సుమారు నాలుగు వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగవుతోంది.

అపూర్వ కలయిక



పెనమకూరులో పూర్వ విద్యార్థుల సమావేశం

తోట్లవల్లూరు: మండలంలోని పెనమకూరు జెడ్పీ పాఠశాల్లోఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆనందోత్సాహాలతో సాగింది. 1984-85వ సంవత్సరంలో పాఠశాలలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఒకచోట కలుసుకున్నారు. ఆనాటి తమ తరగతి గదులను చూసి గత స్మృతులను నెమర వేసుకున్నారు. అనంతరం అందరూ కలిసి భోజనాలు చేశారు. సర్పంచ్ నందేటి గంగాభవాని, పాఠశాల హెచ్ఎం బి. శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు సయ్యద్ అబ్దుల్లా, మహమ్మద్ ముస్తఫా, కళ్లం బాలకృష్ణారెడ్డి, పోపూరి రాజారావు, ఓగిరాల హరికృష్ణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఉచిత వైద్యశిబిరం



బొమ్ములూరులో వైద్య పరీక్షలు



గుడ్లవల్లేరులో వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ రజినీ



తుమ్మలపల్లిలో వైద్య పరీక్షలు

గుడివాడరూరల్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని బొమ్ములూరులో ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా 204వాకర్స్ ఎలెక్ట్ గవర్నర్ లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు, తూర్పు కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ గుత్తా శివరామకృష్ణ(చంటి), క్లబ్ అధ్యక్షుడు కోన రామారావు ప్రారంభించారు. డాక్టర్లు సందీప్, ఇమ్మానుయేల్, అజయ్‌లు గుండె, జనరల్, కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. క్లబ్ జిల్లా పూర్వ గవర్నర్ చంద్రశేఖరరావు, దిమ్మిటి శ్రీనివాసరావు, లింగం చిట్టిబాబు, కుటుంబరావు, కె.రామకృష్ణ, వెంకటేశ్వరరావు, పి.చంద్రశేఖర్, ప్రసాద్ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యురాలు గవిర్నేని రజనీ వైద్య పరీక్షలు చేశారు. దాతలు నర్రా గంగాధరరావు, కొనరాజు బాపయ్యచౌదరి, వల్లభనేని రామకృష్ణ సాయంతో ఈ శిబిరంలో 175 మందికి పరీక్షలు నిర్వహించినట్లు లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు.

తుమ్మలపల్లిలో..

నందివాడ: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు సేవలు అందిస్తున్నామని ఆ సంస్థ కృష్ణా జిల్లా అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి అన్నారు. నందివాడ మండలం తుమ్మలపల్లిలో గ్రామ పెద్దలు గూడపాటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ సింగాల రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మానవత సంస్థ పెద్దలు దండముడి సీతారామస్వామి, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ విస్సంశెట్టి కిషోర్‌బాబు, వైస్ సర్పంచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

వెంట్రప్రగడలో..

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడలో ఆదివారం వంకినేని వెంకట శేషమ్మ, రామబ్రహ్మం మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ కుచేలుబాబు 50 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.

కొనసాగుతున్న సత్యదేవుని బ్రహ్మోత్సవాలు



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో రెండో అన్నవరంగా ప్రసిద్ధి గాంచిన శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారి బ్రహ్మోత్సవాలు ఆదివారం కొనసాగాయి. స్వామికి వేద పండితులు ప్రత్యేక పూజాలు నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలో బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో హోమాలను వేద పండితులు చేపట్టారు.